ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

3

శనివారం 24 ఫిబ్రవరి 2024



పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న స్వామిరెడ్డి

మూడుచింతలపల్లిలో డీఎల్పీవో పర్యటన

శామీర్‌పేట, ఫిబ్రవరి 23 : మండల కేంద్రం మూడు చింతలపల్లి గ్రామంలో డీఎల్పీవో సాంబిరెడ్డి స్వామిరెడ్డి శుక్రవారం పర్యటించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతివనం, క్రీడా మైదానాలను ఆయన పరిశీలించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని పల్లెప్రకృతి వనాలు, నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేకాధికారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బండెల ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మ దేవతకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

కొడంగల్, ఫిబ్రవరి 23: భక్తుల ఇలవేల్పుగా పేరొందిన కొడంగల్ పట్టణంలోని బండెల ఎల్లమ్మ జాతర వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు శుక్రవారం రథోత్సవం నిర్వహించారు. ఉదయం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సల్లంగా చూడాలని మొక్కుకున్నారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. స్థానికులతో పాటు సమీప గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. కాగా శనివారం మూడో రోజు పెరుగు బసంతం నిర్వహించనునట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చేవెళ్ల గ్యారంటీలు

సెంటిమెంట్‌ను కొనసాగించనున్న కాంగ్రెస్

పార్టీ చేపట్టే కార్యక్రమాలనైనా, ప్రభుత్వ పథకాలనైనా చేవెళ్ల గడ్డ నుంచి ప్రారంభిస్తే బాగుంటుందనే ఆనవాయితీని కాంగ్రెస్ కొత్త ప్రభుత్వం మరోసారి కొనసాగించనుంది. ఆరు గ్యారంటీ పథకాల అమల్లో భాగంగా రెండింటిని ఇక్కడి నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తలంచారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ పథకాలను ఈ నెల 27న చేవెళ్ల నుంచి అమలు చేయనున్నారు. ఇందుకు బహిరంగ సభ ఏర్పాట్లలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు నిమగ్నమయ్యారు. తొలుత 2004లో చేవెళ్ల నుంచి అప్పటి ప్రతిపక్షనేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రజాప్రస్థానం పాదయాత్ర ప్రారంభించారు. అదే సంవత్సరంలో ఎన్నికల శంఖారావాన్నీ అక్కడి నుంచే పూరించి విజయం సాధించారు. అప్పటి నుంచి చేవెళ్ల నుంచి ఏదో ఒక ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రారంభించడం కాంగ్రెస్ ముఖ్యమంత్రులకు సెంటిమెంటుగా మారింది!



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి



- చేవెళ్ల గడ్డ నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాల అమలు
- భారీ బహిరంగసభకు ప్రభుత్వం సన్నాహాలు
- ముఖ్య అతిథిగా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ
- భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు ముమ్మరం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిఅర్బన్, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ మరోసారి 'చేవెళ్ల సెంటిమెంట్'ను కొనసాగించాలని నిర్ణయించింది. అన్ని విధాలా అచ్చొచ్చిన ఈ ప్రాంతం నుంచే మరో మారు కీలక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. గతంలో కాంగ్రెస్ సీఎంలు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి చేవెళ్ల నుంచే ఎన్నో కార్యక్రమాలు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ పథకాలే కాకుండా ఎన్నికల ప్రచార కార్యక్రమాలను కూడా ఇక్కడ నుంచే మొదలుపెట్టారు. కాంగ్రెస్ పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత రేవంత్‌రెడ్డి కూడా ఇదే ఆనవాయితీని కొనసాగించడం గమనార్హం. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండింటిని ఈ నెల 27న చేవెళ్లలో ప్రారంభించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీని సైతం ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు భారీగా జనసమీకరణకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు చర్యలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీకి అచ్చొచ్చిన చేవెళ్లలో ప్రభుత్వ పరంగా మరో ముఖ్య కార్యక్రమం జరగనుండడంతో పార్టీ శ్రేణుల్లోనూ ఆనందం వెల్లివిరిస్తోంది. తొలుత చేవెళ్ల నుంచి 2004 సార్వత్రిక ఎన్నికలకు ముందు అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రజా ప్రస్థానం పేరిట పాదయాత్రను ప్రారంభించి కాంగ్రెస్‌లో నూతనోత్తేజం తెచ్చారు. అనంతరం ఎన్నికల ప్రచారానికీ చేవెళ్ల నుంచే శంఖారావాన్ని పూరించి కాంగ్రెస్ పార్టీని విజయ తీరాలకు చేర్చారు. ఇక అప్పటి నుంచి చేవెళ్ల గడ్డ కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్‌గా మారింది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏ పథకం చేపట్టినా వైఎస్సార్ చేవెళ్ల నుంచే ప్రారంభించేవారు. ప్రతిష్ఠాత్మక గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని చేవెళ్ల మండలం ఆలూరు నుంచే నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి అప్పటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ సైతం హాజరయ్యారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులుగా ఉన్న రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం కొన్ని కార్యక్రమాలను చేవెళ్ల నుంచే ప్రారంభించారు.



గత ముఖ్యమంత్రుల బాటలోనే ప్రస్తుత సీఎం

కాంగ్రెస్ గత ముఖ్యమంత్రులు చూపిన ఇదే బాటలోనే రేవంత్‌రెడ్డి కూడా నడుస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఎస్సీ డిక్లరేషన్‌ను చేవెళ్లలోనే ప్రకటించింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరయ్యారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చేవెళ్లతో కాంగ్రెస్‌కు ఉన్న బలమైన బంధాన్ని మరోసారి కొనసాగించాలని నిర్ణయించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసి ఆర్టీసీలో బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఈ పథకం రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతోంది. మహిళల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. అలాగే రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద రూ.10లక్షల ఖర్చు వరకు వైద్యం చేయించుకునే పథకాన్ని అమలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మరో రెండు పథకాలు ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. గ్యారంటీల్లోని 'మహాలక్ష్మి' పథకం కింద వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇవ్వనున్నారు. అలాగే 'గృహజ్యోతి'లో భాగంగా ప్రతీ పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. ఈ రెండు పథకాల అమలుకు చేవెళ్ల నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ ముఖ్య అతిథిగా, మరి మరి కొందరు జాతీయస్థాయి నేతలు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో బహిరంగ సభను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం కలెక్టర్ శశాంక, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీంభరత్, వివిధ శాఖల అధికారులు సభాస్థలం, హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం అధికారులతో బహిరంగ సభ స్థలం ఏర్పాట్లపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సభకు ఎన్నో రోజులు లేనందున ఏర్పాట్లను వేగిరం చేయాలని ఆదేశించారు. సమీక్షలో ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్‌రావు, డీఆర్డీవో పీడీ శ్రీలత, ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్, సీఐ లక్ష్మారెడ్డి, ట్రాన్స్‌కో ఏడీఈ స్వామి, ఏఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల సభను విజయవంతం చేయాలి : ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమల్లో భాగంగా ఈ నెల 27న చేవెళ్లలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం నేత భీం భరత్, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి అన్నారు. శుక్రవారం వారు చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా గృహజ్యోతి(200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్), రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాల ప్రారంభోత్సవాన్ని చేవెళ్లలో నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. బహిరంగ సభ 27న సాయంత్రం చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఉంటుందన్నారు. సభకు భారీ సంఖ్యలో మహిళలు, ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర పీఆర్ చాంబర్స్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు సున్నపు వసంతం, ప్యాక్స్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి, బండారు శైలజాఆగిరెడ్డి, మాణిక్యరెడ్డి, సురేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, నర్సింలు, ప్రభాకర్, పాండుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం

- హాల్ టికెట్ ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదు : డీఐఈవో కిషన్



మేడ్చల్ ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక అమలు చేశామని మేడ్చల్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి(డీఐఈవో) కిషన్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులకు సూచనలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఫీజుల పేరిట విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం మొత్తం 139 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కేంద్రాల్లో ప్రథమ సంవత్సరంలో 65965 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 65,495 మంది, మొత్తం 1,31,460 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా నేరుగా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. హాల్ టికెట్‌పై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం కూడా అవసరం లేదన్నారు. గతేడాది ఫలితాల కన్నా ఈ సారి ఫలితాలు మెరుగుపడేలా అన్ని కళాశాలల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. విద్యార్థులు పరీక్షల్లో అన్ని సమాధానాలు రాసేలా అవగాహన కల్పించామని, పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగకుండా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణ విధుల్లో జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి, ముగ్గురు డీఈసీ సభ్యులు, హైపవర్ కమిటీ సభ్యులు ఉంటారన్నారు. ఈ ఏడాది సైతం నిమిషం నిబంధన అమలు చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా పరీక్షల విషయంలో తీవ్ర ఆందోళనకు గురైతే 14416 లేదా 1800-914416 టోల్‌ఫ్రీ నంబర్లలో సంప్రదించాలన్నారు. పరీక్షలపై సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరుకు 040-27118584 నంబరులో సంప్రదించాలన్నారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో హాట్ టిక్కెట్లు ఇవ్వకపోతే మల్కాజిగిరి డీఐఈవోకార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు.



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ విజయకుమార్, బీఆర్ఎస్ జడ్పీటీసీలు

జడ్పీ చైర్‌పర్సన్ అవిశ్వాస నోటీసుపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు వైస్ చైర్మన్, బీఆర్ఎస్ జడ్పీటీసీల విజ్ఞప్తి

వికారాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం ప్రకటిస్తూ తాము ఇచ్చిన నోటీసుపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీకి చెందిన జడ్పీ వైస్ చైర్మన్ విజయకుమార్, బీఆర్ఎస్ జడ్పీటీసీలు కె.నాగిరెడ్డి, మహిపాల్, రాందాస్‌లు కలెక్టర్ నారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సునీతారెడ్డి ఈనెల 16వ తేదీన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపామున్షీ, సీఎం రేవంత్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విదితమే. పార్టీ మారిన సునీతారెడ్డిపై అవిశ్వాసం ప్రతిపాదిస్తూ నోటీసు ఇవ్వాలంటూ బీఆర్ఎస్ అధిష్ఠానం ఆదేశించడంతో ఆపార్టీ జడ్పీటీసీలు 17వ తేదీ, శనివారం జిల్లా అదనపు కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. కాగా, జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రతిపాదిస్తూ ఇచ్చిన నోటీసుపై ఇంత వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని జడ్పీ వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు శుక్రవారం కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నోటీసు అందజేసి వారం రోజులు గడిచినా ప్రత్యేక సమావేశం ఏర్పాటుపై ఇంత వరకు తమకు ఎలాంటి సమాచారం అందలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అవిశ్వాసం ప్రతిపాదిస్తూ ఇచ్చిన నోటీసుపై ఇంకా ఆలస్యం చేయకుండా ప్రత్యేక సమావేశం ఏర్పాటుపై సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గుట్టలు కరిగి.. లోయలయ్యో!

పరిగిలో యథేచ్ఛగా మట్టి దందా!

- అనుమతి గోరంత... తవ్వకాలు కొండంత
- రాత్రింబవళ్లు అక్రమ రవాణా
- అధికారులకు కాసుల పంట



మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

పరిగి, ఫిబ్రవరి 23: మట్టే కదా.. అదేం.. చేస్తారని అనుకోవచ్చు. ఇందులోనే ఉంది మతలబు. అదే మట్టిని మాయం చేస్తున్నారు అక్రమార్కులు. గుట్టలకు, గుట్టలను మాయం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడే కాలనీలు, రోడ్లకు, ఇళ్ల పునాదుల్లోకి మట్టిని తరలించి లక్షలు సంపాదిస్తున్నారు. రాత్రింబవళ్లు తవ్వకాలు జరిపి గుట్టలను సొరంగాలుగా మారుస్తున్నారు. ఈ తవ్వకాలు ప్రభుత్వ భూముల్లోనే జరుపుతూ టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. నాలుగైదు ఎకరాల అనుమతి పొంది వందల ఎకరాల్లో మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఇంతతతంగం జరుగుతున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. సర్కారుకు రావాల్సిన రాయల్టీని ఎగ్గొడుతున్నారు.



వెంచర్లకు అక్రమంగా తరలించిన మట్టి

అక్రమ మట్టి దందాల్లో అందరి పాత్ర..

పరిగి ప్రాంతంలో మట్టిదందా ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు పాత్ర ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ అక్రమ మట్టి దందా పంచాయితీ పోలీసుల వద్దనే జరుగుతుందటే ఏ స్థాయిలో ఉందో వ్యాపారం జరుగుతుందంటే అర్థమవుతోంది. వ్యాపారులు, అధికార, విపక్ష పార్టీల నాయకులు మట్టి దందాను నడిపిస్తున్నారు. వారు ఇచ్చే డబ్బులతో అధికారులు కూడా చూసినడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారులతో పాటు, ఓ సంస్థకు చెందిన వ్యక్తి కూడా మట్టి దందాలో డబ్బుల వసూళ్లకు తెరలేపారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బుల వసూళ్లకు సంబంధించి సంభాషణలు ఆడియో కూడా ఇటీవల వైరల్ అయింది. అక్రమ మట్టి దందాల్లో ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఓ డివిజన్‌స్థాయి అధికారే మట్టి దందా పంచాయితీలను తన కార్యాలయంలో సెటిల్ చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

తవ్వుకునోళ్లకు తవ్వుకున్నంత

అక్రమ మట్టి దందా అధికారులకు కాసుల పంట కురిపిస్తున్నది. పరిగి ప్రాంతంలోని అసైన్డ్ భూముల్లో తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత మట్టి అన్న చందంగా వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు రెవెన్యూ అధికారులకు అక్రమ ఆదాయాన్ని సమకూరుస్తున్నది. పరిగి మండలంలో ఇబ్రహీంపూర్, రంగంపల్లి, తుంకులగడ్డ, సుల్తాన్‌పూర్, జాఫర్‌పల్లి, సయ్యద్‌మల్కాపూర్, ఖుదావంద్‌పూర్. రాఘవాపూర్,పూడూరు, దోమ మండలాల్లో పలు గ్రామాల్లో అసైన్డ్ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రెవెన్యూ అధికారుల కళ్లముందే ఈ తతంగం జరుగుతున్నా తమకెందుకులే అన్నట్లు వ్యహరిస్తున్నారే తప్పా, అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవడం లేదు. అక్రమ మట్టి తవ్వకాల విషయమై రెవెన్యూ అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోతోంది.



పరిగి మండలం ఇబ్రహీంపూర్‌లో తవ్వకాలు

● **కడ్తాల్ :** కడ్తాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్వపరి పాలనలో భాగంగా విద్యార్థులు చక్కటి వేషధారణతో తోటి విద్యార్థులకు బోధించిన తీరు చూపరులకు ముచ్చట గొలిపింది.

విద్యార్థినులు ఆకర్షణకు లోనుకావొద్దు


అవగాహన కల్పిస్తున్న పీటీమ్ సభ్యుడు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 23: విద్యార్థినులు కొన్ని విషయాల పట్ల ఆకర్షణకు లోనుకావొద్దని టీషీమ్ సభ్యులు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల పాఠశాల విద్యార్థినులకు గురువారం ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. అమ్మాయిలకు ఎటువంటి సమస్య వచ్చినా 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏదైనా ఆపద వచ్చినప్పుడు గాబరా పడకుండా తెలివిగా ప్రవర్తించాలని తెలిపారు. వసతి గృహాల నుంచి బయటికి వెళ్లిన తర్వాత సరైన జీవిత మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పిచ్చయ్య, గోపాల్, ప్రమోద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


భూమి పూజ చేస్తున్న ఎంపీపీ పద్మ

మాడ్గుల, ఫిబ్రవరి 23 : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ గౌరవరం పద్మ అన్నారు. మండలంలోని అందుగుల గ్రామంలో అండర్‌డ్రైనేజీ పనులకు శుక్రవారం ఆమె భూమి పూజ చేశారు. పీఏసీఎస్ జగన్‌గౌడ్ ఎంపీపీని సంప్రదించి గ్రామ సమస్యలను వివరించడంతో వెంటనే స్పందించి మండల పరిషత్ నిధులు రూ.2లక్షల మంజూరు చేయించారు. సర్పంచ్ విజయలక్ష్మి రాజు, రమేష్, పెంటయ్య, వెంకటయ్య, ఇస్మాయిల్, జంగయ్యలు తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం

కొందుర్గు, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని పర్వతాపూర్‌లో తాగునీటి పైప్‌లైన్ పనులను శుక్రవారం ఎంపీటీసీ సభ్యురాలు బి.మంజుల మల్లేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రూ.5లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. కిలోమీటర్ దూరంలో ఉన్న మంగళి చెరువు నుంచి గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వరకు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య గురించి చెప్పిన వెంటనే స్పందించి నిధులను మంజూరు చేయించి, తాగునీటి సమస్యను తీర్చుతున్న ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


తల్లుల ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు


తల్లుల దర్శనం కోసం క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు


తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ క్యూలైన్లలో జనం


తిరుగుపయనమైన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్లు, భక్తులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు


మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయిన గద్దెల ప్రాంగణం

భక్త జన హోరు..

▶▶ వనదేవతల రాకతో పోటెత్తిన భక్తులు ▶▶ నిరంతరాయంగా దర్శనాలు ▶▶ మొక్కులు చెల్లించుకున్న సీఎం, గవర్నర్



ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

మేడారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతుండగా తరలివస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం పోటెత్తుతోంది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీ ప్రవేశ ద్వారాల వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వేచిచూస్తుండడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మరింత జోరందుకుంది.

ప్రముఖుల తాకిడి

జాతరలో శుక్రవారం వీఐపీల తాకిడి పెరిగింది. ప్రముఖులంతా ఈ రోజే రావడంతో అధికారులపై ఒత్తిడి కనిపించింది. గవర్నర్ తమిళిసై సౌందరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్కను దర్శించుకొని మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం గవర్నర్‌తోపాటు కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు చీరెలను సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్‌వీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ సీఎం శాంతికుమారి తదితరులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్క సీఎంకు స్వాగతం పలకగా అధికారులు ఆలయ మర్యాదలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు తల్లులను దర్శించుకున్న వారిలో ఉన్నారు.



నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర

గద్దెలపై కొలువుదీరి భక్తులకు ఆశీస్సులందిస్తున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. దీంతో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తెరపడనుంది. శనివారం సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు మిగతా పూజారులు సమ్మక్క గద్దె వద్దకు చేరుకొని చివరి పూజలు చేసి.. తల్లి రూపాన్ని తీసుకొని చిలకలగుట్టపైకి తీసుకువెళ్లి నిజస్థానంలో ఉంచి వెనుదిరుగుతారు.

హరితహారం లక్ష్యాలను అధిగమించాలి

●జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఫిబ్రవరి 23 : హరితహారం లక్ష్యాలను అధిగమించేలా అధికారులు పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణకు హరితహారం కార్యాచరణ ప్రణాళికపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో గత సంవత్సరం ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు శాఖల వారీగా సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఔషధ మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోడ్లకిరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ కోసం మొక్కలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఖాళీ స్థలాన్ని గుర్తించి పంచాయతీలకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పొలాలగట్లపై కూడా మొక్కలు నాటాలని ఆయన సూచించారు. సమావేశంలో డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ డీఆర్డీవో ఎ.శ్రీనివాస్, పరిశ్రమశాఖ అధికారి వినయ్ కుమార్, పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ అనిల్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, జిల్లా గనుల శాఖ అధికారి సామెల్‌జాకబ్, ఉద్యానవన శాఖ అధికారి అర్చన, మున్సిపల్ కమిషనర్లు మహమ్మద్ జాకీర్ అహ్మద్, వెంకటయ్య, బలరాంనాయక్, విక్రమ్‌సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వ్యయాలు పక్కాగా ఉండాలి

●గ్రామసభ ద్వారా పనులు గుర్తించాలి

●పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ

తాండూరు, ఫిబ్రవరి 23 : గ్రామ పంచాయతీల ఆదాయం, వ్యయాల లెక్కలు పక్కాగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. రెండు నెలలకోసారి గ్రామసభలు నిర్వహించి ఆ వివరాలను ప్రజల ముందు ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పంచాయతీకి వచ్చే ప్రతి రూపాయిని ట్రెజరీలో అదే రోజు జమా చేయాలని, చెక్కుల ద్వారా ట్రెజరీ నుంచే ఖర్చులకు చెల్లింపులు చేయాలని సూచించారు. నేరుగా చెల్లించొద్దని స్పష్టం చేశారు. వాటికి పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి బాధ్యులని, వారి జాయింట్ సంతకంతోనే నిధులు డ్రా చేయాలని తెలిపారు. ఖర్చు, ఆదాయ వివరాలు, క్యాష్ బుక్కు నందు అప్‌డేట్ చేయాలని, ప్రతి బిల్లుకు సంబంధించి ఎంబీ రికార్డు, ఓచర్స్, బిల్లులు తప్పని సరిగా ఉండాలని చెప్పారు. ఎలక్ట్రికల్ మెటీరియల్, పబ్లిక్ హెల్త్ మెటీరియల్‌ను డీసీపీ ఆమోదించిన రేట్ల మేరకు టెండర్ రూల్స్‌ను అనుసరించి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు.

సౌకర్యాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలు

మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలి. వీధి దీపాలు 90 శాతం ఉండేలా, కాలిపోయిన వాటి స్థానంలో వెంటనే కొత్తవి అమర్చేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి ఇంటికి నీటి సరఫరా జరగాలి. ఎప్పటికప్పుడు సప్లైని ప్రత్యేకాధికారి పర్యవేక్షిస్తూ మరమ్మత్తులు వెంటనే జరిగేలా చూడాలి. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలి. వారంలో ఒకరోజు డ్రైడే పాటించేలా చూడాలి. నర్సరీకి నీళ్ల అందుతున్నాయా లేదా పర్యవేక్షిస్తూ మొక్కలు చనిపోకుండా చూడాలి.

అనుమతులన్నీ ఆన్‌లైన్‌లోనే

గృహనిర్మాణ అనుమతులను మాన్యువల్‌గా ఇవ్వొద్దని, టీఎస్‌బీపాస్ ద్వారానే ఇవ్వాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ట్రేడ్ లైసెన్స్‌లు కూడ ఆన్‌లైన్‌లో ఇవ్వాలని, ఫీజులన్నింటిని ఆన్‌లైన్‌లో కట్టించుకోవాలని సూచించారు.


గ్రామ పంచాయతీ భవనం

అభివృద్ధి పనులకు యాక్షన్‌ప్లాన్

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలని, బిల్లులు చెల్లించే ముందు ఆ పనులను పరిశీలించాలని పంచాయతీరాజ్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. గ్రామసభ ద్వారా గుర్తించిన పనులకే ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

పంచాయతీ స్థలాల పరిరక్షణకు చర్యలు

ఖాళీ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. గ్రామపంచాయతీకి సంబంధించిన ఖాళీ స్థలాలు, స్థిరాస్తుల వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని ఆదేశాలు వచ్చాయి.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

●ఎంపీపీ మంద జ్యోతి


వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ జ్యోతి

కందుకూరు, ఫిబ్రవరి 23 : మండలంలోని లేమూరులో నిషితా ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ప్రిన్సిపాల్, క్యాంటీన్ కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మంద జ్యోతి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేయగా ప్రిన్సిపాల్ నాగభూషణచారి అందుబాటులో లేకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పాఠశాలలో 1060మంది విద్యార్థులు చదువుతున్నారని, వారిలో యాభై శాతం మంది తామర, అలర్జీతో బాధపడుతున్నా కనీసం వైద్య పరీక్షలు చేయించలేదని ఆరోపించారు. పాఠశాలలో డైనింగ్ టేబుల్స్‌ను వారానికి ఒక్కసారి కూడా శుభ్రం చేయడం లేదని విద్యార్థులు గోడు వెల్లబోసుకున్నారని చెప్పారు. ప్రిన్సిపాల్, కాంట్రాక్టర్ కుమ్మక్కై విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై ఇన్‌చార్జి టీచర్‌ను ప్రశ్నించగా ఆమె పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్లు ఎంపీపీ చెప్పారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై వారి తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకే ఆకస్మిక తనిఖీ చేశామన్నారు. పాఠశాలలోని సమస్యలపై ఉన్నతాధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ తెలిపారు. విద్యార్థులకు వెంటనే ప్రత్యేకంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు.

పోస్టింగ్ ఒకచోట.. విధులు మరోచోట

●డీఎఫ్‌వో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బీట్ అధికారి

ధారూరు, ఫిబ్రవరి 23 : పోస్టింగ్ ఓ చోట ఉండగా విధులు మరోచోట నిర్వహిస్తున్నారు ఓ అటవీశాఖ బీట్ అధికారి. వివరాలిలా ఉన్నాయి. ధారూరు అటవీరేంజ్ పరిధిలోని రాస్నం సెక్షన్, దోర్నాల్ బీట్ అధికారి సిరాజుద్దీన్ ఇక్కడ విధులు నిర్వహించటంలేదు. విధుల్లో చేరిన తర్వాత నెల రోజులు మాత్రమే దోర్నాల్ బీట్‌లో ఆయన పనిచేశారు. అనంతరం రెండేళ్లుగా డీఎఫ్‌వో కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఇక్కడ పని చేయటం లేదని ఆరోపణలున్నాయి. సిరాజుద్దీన్ స్థానంలో మరో బీట్ అధికారి అనంద్‌కు సంబంధిత అధికారులు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అన్ని శాఖలలో ప్రభుత్వం డిప్యూటేషన్లను రద్దు చేస్తుండగా, ఈ శాఖలో కొనసాగటం గమనార్హం. కాగా పూర్తిస్థాయి బీట్ అధికారి లేకపోవటంతో దోర్నాల్ అటవీ ప్రాంతం నాశనమవుతోంది. పలువురు చెట్లను నరికి అడవిని ఆక్రమించుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అటవీ రేంజ్‌లో బీట్ అధికారుల కొరత ఉండగా ఉన్న బీట్ అధికారిని డీఎఫ్‌వో కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధుల్లోకి తీసుకోవటం విమర్శలకు తావిస్తోంది. కాగా బీట్ ఆఫీసర్‌గా ఉన్న సిరాజుద్దీన్ డీఎఫ్‌వో కార్యాలయంలో గెజిటెడ్ అధికారి స్థాయి విధులు నిర్వహించటంపై ఆ శాఖ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించవలసిన వ్యక్తి గెజిటెడ్ అధికారి సీట్లో కూర్చొని చక్రం తిప్పుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పలువురు అధికారులు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి సిరాజుద్దీన్ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని కోరుతున్నారు.

పాపం.. పసిపాప

●కరువైన అమ్మ ఆలన, నాన్న లాలన ● శిశువిహార్‌కు తరలింపు


చిన్నారిని శిశువిహార్‌కు తరలిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 23) : కొడుకు మీద ఆశ, డబ్బు మీద అత్యాశ తో ఓ జంట తమకు నాలుగో సంతానంగా పుట్టిన బిడ్డను వదిలించుకోవాలనుకుంది. రూ.25 వేలు, తులం బంగారానికి ఆ చిన్నారిని అమ్ముకోవాలని ప్రయత్నించగా.. విషయం తెలుసుకున్న శిశు సంక్షేమ శాఖాధికారులు వారికి కౌన్సిలింగ్ చేశారు. సీడీపీవో శోభారాణి, సూపర్ వైజర్ అనురాధ, అంగన్‌వాడీ టీచర్ స్వప్న కలిసి శుక్రవారం చేవెళ్ల మండలం బస్తేపూర్ గ్రామంలోని పిచ్చకుంట్ల మల్లేష్ సుజాత ఇంటికి చేరుకున్నారు. తల్లిపాలకు నోచుకోని చిన్నారికి డబ్బా పాలు పట్టించి, వైద్య పరీక్షలు నిర్వహించారు. తల్లిదండ్రులకు భారంగా మారిన ఆ పాపను ఐసీపీఎస్ ప్రొటెక్షన్ అధికారి దేవేందర్‌చారికి అప్పగించారు. అనంతరం చిన్నారిని శిశువిహార్‌కు తరలించారు.

28 నుంచి ఇంటర్ పరీక్షలు

●వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

వికారాబాద్, ఫిబ్రవరి 23 : ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 28, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 29 నుంచి ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం వార్షిక పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ఎస్.శంకర్ అన్నారు. శుక్రవారం నోడల్ అధికారి కార్యాలయంలో ఇంటర్ పబ్లిక్ థియరీ పరీక్షల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరంలో జనరల్ 6,447, ఒకేషనల్ 1,352, ద్వితీయ సంవత్సరం జనరల్ 7689, ఒకేషనల్ 1,335 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, స్క్వాడ్ మెంబర్స్, కస్టోడియన్స్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్స్ ఇంటర్ థియరీ పరీక్షలను ఇంటర్ బోర్డు నియమ, నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీటి సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. పరీక్షల నిర్వహణలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రాజమోహన్, బుచ్చయ్య, వివిధ కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ మెంబర్లు, కస్టోడియన్స్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ భూస్థాపితం

●ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి


ప్రసాద్‌ను సన్మానిస్తున్న మల్లు రవి

ఆమనగల్లు, ఫిబ్రవరి 23 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ భూస్థాపితం తప్పదని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 14 ఎంపీ స్థానాలు కైవసం చేసుకొని, కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన పర్యటించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయుసీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఎంగళి ప్రసాద్‌ను ఆయన సత్కరించారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య మల్లు రవిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తోందన్నారు. మండ్లీ రాములు, రవీందర్‌నాయక్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ఖాదర్‌ఖాద్రీ, రాఘవేందర్, నారాయణ, జంతుక యాదయ్య, కుమార్‌గౌడ్, రాజశేఖర్, గోల్డ్ రాము, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

28న మహేశ్వరం ఎంపీపీ ఎన్నిక

●హాజరుకావాలని ఎంపీటీసీలకు నోటీసులు

●గోవాలో బీఆర్ఎస్ సభ్యుల క్యాంపు

మహేశ్వరం, ఫిబ్రవరి 23 : మహేశ్వరం ఎంపీపీ ఎన్నికకు ప్రణాళిక సిద్ధమవుతోంది. ఈ నెల 28న ఎన్నిక ఉంటుందని దీనికి మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలు హాజరుకావాలని ఎన్నికల అధికారి గురువారం, శుక్రవారం నోటీసులు జారీచేశారు. ఎంపీపీగా కొనసాగిన మన్‌సాన్‌పల్లికి చెందిన కె.రఘుమారెడ్డి అనివార్యకారణాల వల్ల తన ఎంపీటీసీ సభ్యత్వంతో పాటు ఎంపీపీ పదవికి సెప్టెంబర్ 13న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు వైస్‌ఎంపీపీ ఆర్. సునితఅంద్యానాయక్‌ను ఇన్‌చార్జి ఎంపీపీగా నియమించారు. మండలంలో మొత్తం 13 ఎంపీటీసీలు ఉండగా రఘుమారెడ్డి రాజీనామాతో మిగిలిన 12 మంది ఈ ఎన్నికకు హాజరుకావాల్సి ఉంది. బీఆర్ఎస్‌కు 7, బీజేపీకి 5గురు సభ్యులున్నారు. కాగా బీఆర్ఎస్‌కు చెందిన 5గురు ఎంపీటీసీలు గోవాలో క్యాంపు రాజకీయాలకు తెరలేపారు.

ఎంపీడీవోలకు ఘనసన్మానం

నందిగామ/మంచాల, ఫిబ్రవరి 23 : నందిగామ, మంచాల ఎంపీడీవోలుగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌ను శుక్రవారం ఆయా మండలాల్లో ఎంపీపీలు ప్రియాంక శివశంకర్‌గౌడ్, జాటోత్ నర్మదలచ్చిరాం ఘనంగా సన్మానించారు. మండలాల అభివృద్ధికి ఎంపీడీవోలు కృషి చేశారని వారు కొనియాడారు. జడ్పీవైస్‌చైర్మన్ ఈట గణేష్, మంచాల ఎమ్మార్వో ప్రసాద్‌రావు, వైస్‌ఎంపీపీ రాజేశ్వరి, సూపరిండెంట్ జంగయ్య ఎంపీటీసీలు చీరాల రమేష్, ఎల్.చంద్రశేఖర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, కొమ్ముక్రిష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు పాండురంగారెడ్డి, జేకే నర్సింలు, అధికారులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

● ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మిషన్‌భగీరథ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 23: హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శుక్రవారం మిషన్‌భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో మిషన్ భగీరథ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులపై ఆరాతీశారు. వేసవి సమీపిస్తుండటంతో తాండూరు నియోజకవర్గంలో ఇలాంటి నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందు జాగ్రత్తలు తీసుకుని ప్రజలకు వేసవిలో ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, కాంగ్రెస్ నాయకులు అజయ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అంచనా బడ్జెట్ రూ.66.9కోట్లు

● ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులు
● పాల్గొన్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఫిబ్రవరి 23: వికారాబాద్ మున్సిపల్ 2024-25 సంవత్సరానికి గానూ రూ.66.9కోట్ల అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇందులో ఖర్చులు రూ.66.72కోట్లు పోను మిగులు బడ్జెట్ రూ.26.3లక్షలుగా ఉంటుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. వీటిలో మున్సిపాలిటీకి వివిధ పన్నుల రూపేన రూ.10కోట్లు, నాన్‌ట్యాక్స్‌లు రూ.10.16కోట్లు, డిపాజిట్స్ అడ్వాన్స్‌లు రూ.45లక్షలు, మునిసిపల్ గ్రాండ్ మొత్తం కలిపి రూ.46.10 కోట్లుగా చూపించారు. అదేవిధంగా వేజెస్ అండ్ శాలరీలు రూ.5.85కోట్లు, శానిటేషన్ పరంగా రూ.2.54కోట్లు, విద్యుత్ రూ.175కోట్లు, లోన్స్ రూ.1.10లక్షలు, గ్రీన్ బడ్జెట్ రూ.2.26 లక్షలు, మున్సిపాలిటీలోని వివిధ భాగాలకు కలిపి మేంటేనెన్స్ చార్జీలు రూ.3.22కోట్లు, క్యాపిటల్స్ వర్క్స్ రూ.3.69కోట్లు, గ్రాంట్స్ రూ.46.10కోట్లు, డిపాజిట్లు రూ.45లక్షలు కలిపి మొత్తం రూ.66.9కోట్ల అంచనా బడ్జెట్‌ను అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సమక్షంలో ప్రవేశపెట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ శంషాద్‌బేగం, కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల

మీడియాకు సమాచారం లేకుండా బడ్జెట్

మున్సిపల్ ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు తీరు ఎవరికి వారే యమున తీరే అనే విధంగా మారింది. ముఖ్యంగా మనిన్సిపల్ చైర్‌పర్సన్ మంజులతో పాటు కమిషనర్ జాకీర్ అహ్మద్ ఒట్టెద్దుపోకడలకు పోతున్నారు. బడ్జెట్ సమావేశం పై కనీసం మీడియాకు సమాచారం ఇవ్వలేదు. మున్సిపాలిటీ జీవో ప్రకారం మున్సిపల్ సాధారణ సమావేశంతో పాటు బడ్జెట్ సమావేశం నిర్వహించిన తర్వాత మీడియాకు వివరాలు వెల్లడించాల్సి ఉంటుంది. అయితే వీటిని చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ జాకీర్ అహ్మద్ విస్మరించారు. గతంలో చైర్‌పర్సన్ మంజుల బీఆర్‌ఎస్‌లో ఉన్న సమయంలో సొంత పార్టీ నాయకుల్లో వ్యతిరేకత, పార్టీలో అంతర్గత గొడవలు ఉన్నప్పటికీ మీడియాకు స్వయంగా ఫోన్‌చేసి రావాలని కోరారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మీడియా అంటే పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని మీడియా మిత్రులు మండిపడుతున్నారు. మున్సిపాలిటీలో నాలుగు సంవత్సరాలుగా అభివృద్ధి పక్కన పెట్టి రాజకీయాలపై చైర్ పర్సన్ దృష్టి పెట్టారే తప్పా చేసిన అభివృద్ధి ఏం లేదనే విమర్శలు ఉన్నాయి. అయినప్పటికీ చైర్‌పర్సన్ వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు లేదని పలువురు అంటున్నారు. బడ్జెట్ సమావేశం వివరాలు తెలుసుకునేందుకు మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసినప్పటికీ ఆయన స్పందించకపోవడం గమనార్హం. దీనిబట్టి కమిషనర్ సైతం ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో పనిచేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆలయాల్లో వైభవంగా కల్యాణ మహోత్సవాలు



తాండూరు రూరల్: శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న జడ్పీటీసీ గౌడి మంజుల, గౌడి రమేష్ దంపతులు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 23: తాండూరు మండలం చెంగోల్ గ్రామ శివారులోని మల్లికార్జునస్వామి ఆలయ 22వ వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణంలో పార్వతీదేవి తరఫున గౌడి మంజుల వెంకటేశం దంపతులు, పరమేశ్వరుని తరపున గౌడి సాయిదీపిక, రమేష్‌కుమార్ దంపతులు కూర్చుని కల్యాణం నిర్వహించారు. అర్చకులు మడపతి రాజశేఖర్‌స్వామి, కిషోర్‌పంతులు, విజయస్వామి, మోనప్పస్వాములు వేదమంత్రోచ్చరణల మధ్యన కల్యాణం జరిపారు. ఉదయం 5.30 గంటలకు సుప్రభాతం, రుద్రాభిషేకం, మహా ప్రసాదం, మధ్యాహ్నం 3గంటలకు బోనాలు, పల్లకీసేవా, భజన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 1గంటకు శివ పార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. ధర్మకర్త మేఘమాల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి సమక్షంలో గౌడి వెంకటేశం కార్యక్రమాన్ని పూర్తి చేశారు. తాండూరు పట్టణానికి చెందిన సాయిపుత్ర హోంనీడ్స్ వ్యాపారి బావనోళ్ల చంద్రకళ, శంకర్‌యాదవ్, బావనోళ్ల నీలమ్మ, హన్మయ్య, చంద్రకళ, శంకర్‌యాదవ్ దంపతులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పులేందర్, బి.కృష్ణయ్య, నర్సింహులు, నారాయణరెడ్డి, రాకేష్‌గౌడ్, లక్ష్మీకాంతరెడ్డి, జి.గోపాల్, బిచ్చప్ప, రాము లు, వివేకానంద యువజన సంఘం, ఛత్రపతి యుసేనా సంఘం సభ్యులతోపాటు మండల జడ్పీటీసీ గౌడి మంజుల, వైస్ ఎంపీపీలు స్వరూపా, జడల అన్నపూర్ణ, దేవాదాయ శాఖ ఈవో శేఖర్‌గౌడ్, ఎంపీటీసీ రత్నమాల, మాజీ సర్పంచులు జి.మల్లీశ్వరి, రాజప్పగౌడ్, గోపాల్‌రెడ్డి, సుజాత, మాజీ ఎంపీటీసీ గౌడి వెంకటేశం పాల్గొన్నారు.

కనుల పండువగా వేణుగోపాలస్వామి కల్యాణం

ఘట్‌కేసర్‌రూరల్: ఎదులాబాద్‌లోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ అవరణలోని కల్యాణ మండపంపై రుక్మిణీ, సత్యభామ, వేణుగోపాలస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ ధర్మకర్తలు అమ్మవార్లకు, స్వామివారికి పట్టువస్త్రాలు, అమ్మవార్లకు, స్వామివారికి జిలకర బెల్లం సమర్పించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య రుక్మిణీ, సత్యభామ శ్రీ వేణుగోపాలస్వామి వార్లకు మాంగళ్యధారణ జరిపించారు. భక్తులు ఒడిబియ్యం, పూలు, పండ్లు సమర్పించారు. అంతకు ముందు మహిళలు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారేను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అంబారిపేట అప్పాలాచార్యులు, రాంప్రసాద్, వరదరాజులు, ఎ.వీ.ఎస్.ఎన్ చార్యులు, టీపీ లక్ష్మణాచార్యులు, పురుషోత్తామాచార్యులు, సేనామాచార్యులు, అచ్యుతాచార్యులు, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ రవి, విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.



రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణంలో తలంబ్రాలు సమర్పిస్తున్న పండితులు

ఎంపీ టికెట్ రేసులో లేను

● పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే స్వీకరిస్తా
● తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 23: చేవెళ్ల ఎంపీగా బీఆర్‌ఎస్ నుంచి తాను పోటీ చేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాలు అవాస్తవమని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. తనకు ఎంపీగా పోటీ చేసే ఆలోచన లేదన్నారు. వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్ష పదవి ఆశిస్తున్నానని అన్నారు. వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్ష పదవి తనకే ఇచ్చే అవకాశం ఉందని, ఆ పదవిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

ఎన్నెపల్లిలోని సర్వేనెంబర్ 208, 209లో భూమి రిజిస్ట్రేషన్ ఆపాలి

వికారాబాద్, ఫిబ్రవరి 23: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్నెపల్లిలోని సర్వేనెంబర్ 208, 209లో కొందరు పట్టాదారులకు సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నట్లు తెలిపారు. అట్టి ప్రక్రియ వెంటనే నిలిపివేయాలని రిటైర్డ్ ఎంపీడీవో వెంకటేశం అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టర్‌తో పాటు స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సర్వేనెంబర్ 209లో 4.20గుంటల భూమితో పాటు 208లో 6.20గుంటల భూమిని కాజేసే క్రమంలో ఆన్‌లైన్‌లో స్లాట్‌బుక్ చేసుకున్నట్లు తెలిపారు. కావున అట్టి భూమి రిజిస్ట్రేషన్ జరగకుండా చూడాలని కోరారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 23: బొంరాస్‌పేట్ మండలంలోని ఏర్పుమల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. స్వయం పరిపాలనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో చౌదర్‌పల్లి క్లస్టర్ హెచ్‌ఎం శ్రీహరిరెడ్డి, హెచ్‌ఎం నీలకంఠ, ఉపాధ్యాయులు రాములు, జీవన్‌కుమార్, శ్రీనివాస్, సురేశ్, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి



విజయ సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి తదితరులు

మేడ్చల్ ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని మేడ్చల్ - మల్కాజిగిరిజిల్లా రూరల్ బీజేపీ అధ్యక్షుడు పట్లోళ్ల విక్రంరెడ్డి అన్నారు. జిల్లా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర నేడు మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోకి ప్రవేశిస్తుందన్నారు. ఈనెల 25నజిల్లా రూరల్ పరిధిలోని జవహర్‌నగర్ నుంచి యాత్ర కొనసాగుతుందన్నారు. ఎల్‌బీ నగర్, ఉప్పల్‌ల మీదుగా జవహర్‌నగర్ ద్వారా జిల్లాలోకి చేరుకుంటుందన్నారు. దమ్మాయిగూడ చౌరస్తాలో సమావేశం ఉంటుందన్నారు. మోదీ ఆధ్వర్యంలో బీజేపీని మూడోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. యాత్రకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని మేడ్చల్ జిల్లాలో కూడా యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్, నర్సింహ, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 23: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఎన్‌ఆర్‌ఎస్‌సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) డైరెక్టర్ ప్రకాష్‌చౌహాన్ తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో రెండురోజుల పాటు జరిగే దక్ష-2024 జాతీయ స్థాయి సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితాన్ని ఎప్పుడూ ఒక సవాల్‌గా స్వీకరించి సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. నూతన ఆవిష్కరణలకు శ్రీకారంచుట్టి వాటిని పరిశోధించాలని తెలిపారు. జాతీయస్థాయి సదస్సుల వల్ల కొత్త విషయాలు తెలుస్తాయని, ప్రతీవిద్యార్థి జాతీయ స్థాయి సదస్సులను వినియోగించుకోవాలన్నారు. వృత్తి, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. దేశంలోని తొమ్మిది రాష్ట్రాల నుంచి 12వేల మంది విద్యార్థులు దక్ష-2024 కార్యక్రమంలో పాల్గొన్నారని కో-ఆర్డినేటర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ సదస్సు వైస్ ప్రెసిడెంట్ బాలాజీ ఊట్ల, డైరెక్టర్ ఆఫ్ స్ట్రాటజీ అండ్ డిజిటల్ లెర్నింగ్ అనురాగ్ పల్లా, డీన్లు విజయ్‌కుమార్, ఈవెంట్ కో-ఆర్డినేటర్లు రాజశేఖర్‌రెడ్డి, స్వప్న, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



టెక్నికల్ ఫెస్ట్‌లో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎన్‌ఆర్‌ఎస్‌ఏ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్

వీఐటీ చెన్నై విజేత సీఎంఆర్ జట్టు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 23: వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. వివిధ కళాశాలలకు చెందిన 16టీంలు పోటీలో పాల్గొనగా విజేతగా సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు నిలిచింది. విజేత జట్టును శుక్రవారం కళాశాల వైస్‌చైర్మన్ సీహెచ్ భూపాల్‌రెడ్డి, సెక్రటరీ సీహెచ్ శ్రీశైలంరెడ్డి, ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసులరెడ్డిలు అభినందించారు. కళాశాలలో ఉన్న సౌకర్యాలను విద్యార్థులు ఉపయోగించుకుని క్రీడలపై దృష్టిసారించాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనేలా హెచ్ అండ్ ఎస్ హెచ్‌వోడీ డాక్టర్ కేవీ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాజేష్‌గౌడ్‌లు ప్రోత్సహించారు. విజేతలను వివిధ విభాగాల అధిపతులు, డీన్లు, ఇతర అధ్యాపకులు అభినందించారు.



విజేత జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి

పెండింగ్ డీఏలను చెల్లించాలి

పరిగి, ఫిబ్రవరి 23: పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. పరిగిలోని శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన మూడు డీఏలను ఇవ్వాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు అనుగునంగా ప్రతీ ఆరు నెలలకు ఒకసారి ప్రకటించాల్సిన డీఏలు జాప్యం చేయడం దారుణమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సరెండర్ లీవ్, మెడికల్ లీవ్ తదితర బకాయిలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పీఆర్సీ సిఫారసులు వేగవంతం చేసి వీలైనంత త్వరలో కొత్త పీఆర్సీని ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.బసిరెడ్డి, కార్యదర్శి సతానందగౌడ్, నాయకులు రాజేష్, శ్రీనివాసరావు, కరుణాకర్, రమేశ్, గోపాల్, కనకచారి, అంజిలయ్య, ఖయ్యూమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

వైద్యులు అంకిత భావంతో పనిచేయాలి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 23: ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు అంకితభావంతో పనిచేయాలని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వాసుపత్రిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందులు అందుతున్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరాతీశారు. అనంతరం ఆయన వైద్యులతో చర్చించారు. ఇబ్బందులకు గురి చేయకుండా వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వాసుపత్రులపై ప్రజల్లో ఉన్న అపోహలను దూరం చేసే బాధ్యత వైద్యులదేనని గుర్తుచేశారు.

ఎస్‌డబ్ల్యూయూ జనరల్ సెక్రెటరీగా హన్మంత్ ముదిరాజ్

పరిగి,ఫిబ్రవరి 23: టీజేఎంయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా ఉన్న కె.హన్మంత్ ముదిరాజ్ శుక్రవారం ఎస్‌డబ్ల్యూయూలో చేరారు. ఆ సంఘంలో చేరిన అనంతరం ఆయనకు ఎస్‌డబ్ల్యుయూ జనరల్ సెక్రెటరీగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల హక్కుల సాధనకు పనిచేస్తానన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లసమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

ఓటు వజ్రాయుధం లాంటిది

పరిగి, ఫిబ్రవరి 23: ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని పరిగి తహసీల్దార్ ఆనంద్ రావు అన్నారు. పరిగిలోని పల్లవి డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనదన్నారు. ఓటు విలువను ప్రతీఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. 18ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకోవాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వందశాతం ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాస్, మల్లిఖార్జున్, హెచ్‌ఎంలు గోపాల్, శంకర్, శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

కొడంగల్, ఫిబ్రవరి 23: కొడంగల్ పట్టణ శివారులో వెలిసిన బండెల ఎల్లమ్మ దేవత జాతర కనుల పండువగా జరిగింది. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే సిడె కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ కట్కం శివకుమార్‌గుప్త, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మురారివశిష్ఠ, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

పరిగి, ఫిబ్రవరి 23: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పరిగి వైస్‌ఎంపీపీ కావలి సత్యనారాయణ అన్నారు. మండలంలోని రంగంపల్లి గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో పార్టీలకతీతంగా పనులు చేపడతామని తెలిపారు. తాగునీరు, సీసీ రోడ్లు, మురికి నీటికాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.కృష్ణారెడ్డి, వీరారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కూతురికి ప్రేమ వేధింపులు.. తండ్రి ఆత్మహత్య

యాలాల, ఫిబ్రవరి 23: కూతురును ఓ యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తుండడంతో మనస్తాపానికి గురై తండ్రి ఉరేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా యాలాల మండలంలోని బెన్నూరు గ్రామంలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అమృతప్ప అనే వ్యక్తి కూలిపని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతడి కూతురిని గ్రామానికి చెందిన నవీన్ అనే యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన అమృతప్ప గురువారం ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సదరు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో కిడ్నాపర్ల భయం !

● చిన్నారుల అపహరణ ముఠాలంటూ ప్రచారం
● భయంతో అంగన్‌వాడీ కేంద్రాలు, బడుల ముందు కాపలా



కురుగుంట పాఠశాల గేటుకు తాళం వేసి కాపలా కాస్తున్న సిబ్బంది

మర్పల్లి, ఫిబ్రవరి 23: గ్రామాల్లో చిన్నారులను అపహరించే ముఠాలు సంచరిస్తున్నాయంటూ సోషల్ మీడియాలో సాగుతున్న ప్రచారంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు పంపించేందుకు జంకుతున్నారు. ఈ వదంతులతో ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది ఏకంగా గేట్లకు తాళాలు వేసి గేటు దగ్గరే కాపలా కాస్తున్నారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని కురుగుంట గ్రామంలో పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఇక్కడ శుక్రవారం విద్యార్థులు, చిన్నారులు బయటకు రానివ్వకుండా గేటుకు తాళం వేసి అంగన్‌వాడీ ఆయాలు, పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికులు కాపలా కాశారు. కాగా, మర్పల్లి మండలంలో పిల్లల కిడ్నాపర్లు సంచరించడం లేదని, ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని మర్పల్లి ఎస్సై ప్రజలకు సూచించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి దగ్ధం

కొడంగల్, ఫిబ్రవరి 23: కొడంగల్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇనాయత్ ఖాన్ ఇంట్లో శుక్రవారం షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి దగ్ధమైంది. ఈ ఘటనలో మంటలు చెలరేగడంతో దాదాపు రూ.3లక్షల విలువైన సామగ్రి దగ్ధమైనట్లు బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ హమీద్‌లు బాధితుడిని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందేలా కృషిచేస్తామని భరోసా ఇచ్చారు.



షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన సామగ్రి

లైసెన్స్ లేని హోటల్‌కు జరిమానా

తాండూరు, ఫిబ్రవరి 23: తాండూరు పట్టణంలోని ఓ హోటల్ యజమాని లైసెన్స్ లేకుండా నిర్వహిస్తుండడంతో అధికారులు జరిమానా విధించారు. స్థానికంగా మెట్రో మనీలా రెస్టారెంట్ హోటల్‌ను మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు హోటల్ యజమానికి రూ.25వేల జరిమానా విధించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ కృష్ణయ్య, సిబ్బంది వెంకటయ్య, హరికృష్ణ, అశోక్, శ్రీనివాస్, తదితరులు యజమానికి జరిమానా రసీదును అందజేశారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

కులకచర్ల, ఫిబ్రవరి 23: పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అఖిల భారత బంజార సేవాసంఘం పరిగి తాలూకా అధ్యక్షుడు నేనావత్ రాహుల్‌నాయక్ తెలిపారు. కులకచర్ల మండలంలోని హన్మానాయక్ తండా పాఠశాలలో శుక్రవారం తన సొంత డబ్బులతో ప్రింటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దాలినాయుడు, ఎస్‌ఎంసీ చైర్మన్, మాజీ ఉప సర్పంచ్ చందర్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు ప్రారంభం

శామీర్‌పేట, ఫిబ్రవరి 23: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కేశవరంలో శుక్రవారం మూడుచింతలపల్లి మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గోనె హనుమంతరెడ్డి ప్రారంభించారు.ఈ పథకంలో ప్రతీ వ్యక్తికి రోజుకు రూ.270కి తగ్గకుండా ఉపాధి లభిస్తుందన్నారు. జాబ్‌కార్డు ఉన్న గ్రామంలోని ప్రతీఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ బిల్‌కలెక్టర్ మధుసూదన్‌రెడ్డి, వాటర్‌మన్ రాజు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ డీలర్లు లైసెన్స్‌లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి

తాండూరురూరల్, ఫిబ్రవరి 23: తాండూరు నియోజకవర్గంలోని ఫర్టిలైజర్ల డీలర్లు తమ లైసెన్స్‌లను ఈనెల 29వ లోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి ఆదేశించారు. తాండూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారంతాండూరు పట్టణానికి చెందిన రసాయనిక ఎరువులు, విత్తనాలు విక్రయించే డీలర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. లైసెన్స్ మేనెజ్‌మెంట్ సిస్టం కింద పురుగుమందుల నియంత్రణ చట్టం ప్రకారం ప్రతీ డీలర్ తమ లైసెన్స్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మార్చి 1వ తేదీ నాటికి ఆన్‌లైన్‌లోనే క్రయ విక్రయాలు జరపాలన్నారు. తాండూరు నియోజకవర్గంలోని 53 మంది డీలర్లు ఉన్నారని, తాండూరు పట్టణంలో 21, బషీరాబాద్ మండలంలో 8, యాలాల మండలంలో 14, పెద్దేముల్ మండలంలో 10 మొత్తం 53 మంది డీలర్లు తమ లైసెన్స్‌లను తప్పనిసరిగా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారులు రజిత, తాండూరు పట్టణానికి చెందిన డీలర్లు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా సాహు శ్రీలత

తాండూరు, ఫిబ్రవరి 23: బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా తాండూరుకు చెందిన కౌన్సిలర్ సాహు శ్రీలతను నియమిస్తూ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ప్రకటించారు. శ్రీలత ప్రస్తుతం వికారాబాద్ జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. జిల్లా నుంచి రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గంలో శ్రీలతకు చోటు లభించింది. పార్టీ బలోపేతానికి అన్ని గ్రామాల్లో మహిళా మోర్చా కమిటీలు వేసేందుకు కృషి కృషి చేస్తానని శ్రీలత పేర్కొన్నారు.

ఎంపీ సీటును బీసీలకు కేటాయించాలి

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 23: రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పాలమూర్ ఎంపీ సీటును అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు కేటాయించాలని దేవరఫస్లాబాద్ గ్రామానికి చెందిన బీసీ నాయకుడు కూర వెంకటయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనాభాలో బీసీలు అత్యధికశాతం ఉన్నారనే విషయాన్ని రాజకీయ పార్టీలు గ్రహించాలని సూచించారు. బీసీ అభ్యర్థులకు టికెట్లు కేటాయించాలని కోరారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

కులకచర్ల, ఫిబ్రవరి 23: కులకచర్లలో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను స్థానిక ఎంపీడీవో రామకృష్ణనాయక్, తహసీల్దార్ మురళీధర్‌లు శుక్రవారం పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కావాల్సిన వసతులపై నిర్వాహకులను ఆరాతీశారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.